www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 14 నవంబర్ 2023
5
తిరుపతి చిత్తూరు



నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్, చిత్తూరు అర్బన్

నేటి తరానికి గ్రంథాలయాల ప్రాముఖ్యతను, విశిష్టతను, గ్రంథాలయాల సేవలను తెలియజేసే విధంగా ఈనెల 14 నుండి 20 వరకు స్థానిక అన్నమయ్య సర్కిల్ వద్ద వున్న గ్రేడ్-1 గ్రంథాలయంలో, ఎంఆర్.పల్లిలోని గ్రేడ్-2 బాలల గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఈఏడాది ఘనంగా నిర్వహించుటకు ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ నైనారు మధుబాల తెలిపారు. ఈనెల 14 నుండి 20 వరకు జిల్లా లోని అన్ని గ్రంథాలయాలలో రోజువారీగా ఈ క్రింద విధంగా కార్యక్రమాలు నిర్వహించబడునని పేర్కొన్నారు. 14న గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ వేడుకలు, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న వారిని స్మరించుకొనుట, 17న కవి సమ్మేళనం, 18న విద్యార్థులకు వివిధరకాల పోటీలు నిర్వహించుట, 19న గ్రంథాలయా వారోత్సవాలలో భాగంగా మహిళా దినోత్సవం, 20న డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన, సామూహిక స్వీయపరనం, గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు ప్రముఖులచే విద్యార్థులకు బహుమతులు ప్రదానం ఉంటాయన్నారు. గ్రంథాలయాల ప్రాధాన్యం సామాజిక స్పృహ, విద్య ప్రాధాన్యతను చాటి చెప్పేలా ఈ గ్రంథాలయ వారోత్సవాలను చిత్తూరు, తిరుపతి ఉమ్మడి జిల్లాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీసేందుకు వారికి వక్రుత్వపు పోటీలు, వ్యాస రచన, చిత్రలేఖన, మ్యూజికల్ చైర్ పోటీలు ఉమ్మడి జిల్లాలోని అన్ని గ్రంథాలయాలలో నిర్వహించి వారికి బహుమతులు ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. ఈవారోత్సవాలలో సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పాటకులు తీసుకువెళ్ళిన పుస్తకాలు తిరిగి ఇస్తే వాటికి ఆలస్య రుసుం నుంచి మినహాయింపు ఉంటుందని, కావున పాటకులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని తెలిపారు. అలాగే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు, గ్రంథాలయ పాటకులు ఈ 56వ గ్రంథాలయ వారోత్సవాలలో పాల్గొని గ్రంథాయాల బలోపేతానికి దోహదపడాలని మరియు ఈ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

శ్రీవారి లక్ష్మీకాసుల హారం ఊరేగింపు

ప్రజాశక్తి- తిరుమల:

శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల సందర్భంగా నవంబరు 14న తిరుమల శ్రీవారి లక్ష్మీకాసుల హారాన్ని తిరుచానూరుకు తీసుకెళ్లనున్నారు. శ్రీవారి ఆభరణాలలో అత్యంత ప్రధానమైన లక్ష్మీకాసుల హారాన్ని ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తిరుమలలోని ఆలయ నాలుగు మాడవీధులలో ఊరేగిస్తారు. అనంతరం తిరుమల నుండి బయల్దేరి తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకొస్తారు. మంగళవారం రాత్రి జరిగే గజవాహనసేవలో అమ్మవారికి ఈ లక్ష్మీకాసుల హారాన్ని అలంకరిస్తారు. శ్రీవారి కాసులహారాన్ని ప్రతి ఏటా గజ వాహనం సందర్భంగా అమ్మవారికి అలంకరించడం ఆనవాయితీగా వస్తోంది.

ఎస్వీఎస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో

నేడు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్:

వరల్డ్ డయాబెటిక్ డే సందర్భంగా ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి యాజమాన్యం సోమవారం ప్రకటనలో పేర్కొంది. 14వ తేదీ మంగళవారం ఉదయం 8 నుండి ఒంటి గంట వరకు ఎస్వీఎస్ హాస్పిటల్, చర్చి పక్కన, రాజన్న పార్క్ దగ్గర, ఓల్డ్ మెటర్నిటీ హాస్పిటల్ రోడ్డులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వైద్యశిబిరంలో డాక్టర ఆర్. రఘురాములు, జనరల్ ఫిజీషియన్స్, షుగర్ వ్యాధి నిపుణులు, ఐసియు కేర్ స్పెషలిస్టు డాక్టర్ ఎం. కృష్ణకుమార్, డాక్టర్ జె.అపర్ణ పాల్గొంటారని తెలిపారు. షుగర్, బిపి, థైరాయిడ్, కొలెస్ట్రాల్, కిడ్నీ సమస్యలు, రక్తహీనత, జ్వరాలు, గుండె వ్యాధులకు సంబంధించి ఉచితంగా చేసే పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

శ్రీవారి ఆలయంలో

శాస్త్రోక్తంగా దీపావళి ఆస్థానం

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం ఉదయం దీపావళి ఆస్థానం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ అర్చకులు, తిరుమల జీయంగార్లు, టీటీడీ ఉన్నతాధికారుల సమక్షంలో బంగారువాకిలి చెంత ఆగమోక్తంగా ఆస్థాన వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ శ్రీవారి ఆలయంలో దీపావళి పండుగ సందర్భంగా 'దీపావళి ఆస్థానాన్ని' శాస్త్రోక్తంగా నిర్వహించిట్లు తెలిపారు. దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు చెప్పారు. ఈ దీపావళి ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, ఆయురారోగ్య ఐశ్వర్యాలతో ఉండాలని ఛైర్మన్ ఆకాంక్షించారు. అంతకుముందు ఆలయంలో మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు నూతన పట్టువస్త్రాలు సమర్పించి రూపాయి హారతి, ప్రత్యేక హారతులను నివేధించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లు సహస్ర దీపాలంకరణ సేవలో పాల్గొని, ఆలయ నాలుగు మాడవీధులలో ఊరేగి భక్తులను కటాక్షించనున్నారు. ఆస్థానంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఈవో ఎవి.ధర్మారెడ్డి, డిఎల్ఓ వీర్రాజు, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, ఎస్ ఈ -2 జగదీశ్వర్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, విజివో నంద కిషోర్, పేష్కార్ శ్రీహరి, ఫార్‌పతేధార్ ఉమా మహేశ్వర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వెంకన్న స్వామి.. గెలిపించు...

తెలంగాణ పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి- తిరుమల

తెలంగాణ పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఆదివారం కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామంలో స్వామి పూజలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. రంగనాయకుల మండపంలో రేవంత్ రెడ్డికి ఆలయ పండితులు వేద ఆశీర్వాదంతో పాటు స్వామివారి పట్టువస్త్రం, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అభివద్ధి చెందాలని, ఉభయ తెలుగు రాష్ట్రాలు కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని స్వామిని కోరుకున్నట్లు తెలిపారు. ఇరు రాష్ట్రాల మధ్య ఆర్థిక, రాజకీయ బంధాలు బాగుండాలని ప్రార్థించినట్లు వివరించారు. తెలంగాణకు మంచిరోజులు రాబోతున్నాయని రేవంత్ రెడ్డి చెప్పారు.

నేడు, రేపు సచివాలయ ఉద్యోగుల పరిజ్ఞాన పరీక్షలు

ఉద్యోగుల పరీక్షలు నిర్వహణపై సంబంధిత అధికారులతో మాట్లాడుతున్న డిఆర్ఓ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఈనెల 14,15 తేదీలో రెండు రోజులపాటు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వారిచే సచివాలయ ఉద్యోగులకు కంప్యూటర్ పరిజ్ఞాన పరీక్షలు నిర్వహించనున్నారని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్ సూచించారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్లో పరీక్షల నిర్వహణపై ఏపీపీఎస్సీ అధికారులతో కలిసి జిల్లా రెవెన్యూ అధికారి సమావేశమయ్యారు. డిఆర్ఓ మాట్లాడుతూ శ్రీనివాస మంగాపురం దగ్గరలో గల ఏఐఎం టెక్నాలజీస్ కేంద్రంగా రెండు రోజులపాటు సచివాలయ ఉద్యోగులకు కంప్యూటర్ పరిజ్ఞాన పరీక్షలు ఉంటాయని అందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. అర్థగంట పాటు 4 సెషన్స్‌లో ఈ పరీక్షలు ఉంటాయని 651 మందికి ఉదయం ఉ 9.30 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల వరకు, 2 నుంచి 2.30 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 5.30 గంటల మధ్య నిర్వహించనున్నామని పరీక్షల సమయాలలో విద్యుత్‌శాఖ విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. అభ్యర్థులకు రవాణా సౌకర్యం ఏర్పాట్లు ఏపీఎస్ఆర్టీసీ చూడాల్సి ఉంటుందని అందుకు సంబంధించి సెంట్రల్ బస్‌స్టేషన్‌లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వైద్యశాఖ మెడికల్ క్యాంపు, పంచాయతీ రాజ్ శాఖ తాగునీరు సౌకర్యం ఏర్పాటు చేయాలని తెలిపారు. నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదని సూచించారు. ఈసమావేశంలో ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్లు వెంకటరమణ, శేఖర్, విధులు కేటాయించిన లైసెన్ ఆఫీసర్లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్విజ్ గ్రాండ్ ఫినాలే ఏర్పాట్లు చక్కగా ఉండాలి: కమిషనర్

క్విజ్ గ్రాండ్ ఫినాలే ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ హరిత

ప్రజాశక్తి- తిరుపతి టౌన్ : తిరుపతి స్మార్ట్ సిటీ, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం నిర్వహించనున్న క్విజ్ గ్రాండ్ ఫినాలే ఏర్పాట్లు చక్కగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. కచ్చపి ఆడిటోరియంలో జరుగుతున్న ఏర్పాట్లను సోమవారం సాయంత్రం అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్మార్ట్‌సిటీ, నగరపాలక సంస్థ సంయుక్తంగా ఈ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందిరా మైదానంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన పోటీలకు సుమారు 101 స్కూల్స్ నుంచి విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. వీరిలో ముందు వరుసలో నిలిచిన 8 స్కూల్స్ విద్యార్థులను గ్రాండ్ ఫినాలేకి ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ ఎనిమిది స్కూల్స్ విద్యార్థులకు బాలల దినోత్సవం రోజున మంగళవారం మధ్యాహ్నం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. మొదటి బహుమతి లక్ష రూపాయలు, రెండవ బహుమతి 50వేల రూపాయలు, మూడవ బహుమతి 25 వేల రూపాయలు అతిథుల చేతుల మీదుగా ఇవ్వనున్నామని అన్నారు. మధ్యాహ్నం 2 నుండి 3 గంటల వరకు సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించి 3 గంటలకు ఖచ్చితంగా క్విజ్ గ్రాండ్ ఫినాలే ప్రారంభిస్తామన్నారు. ఈ క్విజ్‌లో ఐదు రౌండ్లు ఉంటాయని తెలిపారు. ఇది వరకే ఎంపికైన స్కూల్స్ యాజమాన్యాలకు పోటీల నిబంధనలు తెలపడం జరిగిందన్నారు. ఆయా స్కూల్స్‌కు కేటాయించిన సీట్లలో వారు కూర్చునేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఆయా స్కూల్స్ యాజమాన్యం విద్యార్థులు సరైన సమయంలో వచ్చేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ వెంట స్మార్ట్‌సిటీ జిఎం.చంద్రమౌళి, తదితరులు ఉన్నారు.

మహిళా వర్సిటీలో క్యాంటీన్‌కు టెండర్లు ఆహ్వానం

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని క్యాంటీన్‌కు నూతనంగా టెండర్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.రజిని ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీపద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో క్యాంటీన్‌ను నిర్వహించేందుకు నూతన టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు, క్యాంటీన్లో నిర్ణయించిన వస్తువులు అమ్మడం కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. నవంబర్ 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. టెక్నికల్ బిడ్ ఓపెనింగ్‌ను 23వ తేదీ సాయంత్రం 4 గంటలకు, ఫైనాన్షియల్ బిడ్ ఓపెనింగ్ 23వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఓపెన్ చేయడం జరుగుతుందన్నారు. పూర్తివివరాల కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ ఎస్పిఎంవివి.ఏసీ. ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు. బిడ్ ఓపెనింగ్ ను కమిటీ హాల్, నియర్ రిజిస్ట్రార్ ఛాంబర్, అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి నందు ఓపెన్ చేయడం జరుగుతుందన్నారు. ఇందులో వర్సిటీ రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ ప్రకారం టెండర్ దరఖాస్తు వేసే ప్రతి ఒక్కరు పాటించవలసి ఉంటుందని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

రేపు అబ్దుల్ కలాం జీవన సాఫల్య పురస్కారాల ప్రధానోత్సవం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

2023 సంవత్సరానికి మాజీ రాష్ట్రపతి ఏపిజె అబ్దుల్ కలాం జీవనసాఫల్య పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం బుధవారం తిరుపతిలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు అభిలాష హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు డాక్టర్ సరోజనమ్మ తెలిపారు. సోమవారం ఈ మేరకు ఆమె ఓ పత్రిక ప్రకటనలో తెలియజేశారు. బుధవారం ఉదయం 10 గంటలకు తిరుపతి ఆఫీసర్స్ క్లబ్బులో జరిగే ఈ కార్యక్రమంలో వివిధ రంగాల్లో నిష్ణాతులైన ప్రముఖ వ్యక్తులకు ఈ పురస్కారాలను ప్రధానం చేసి గౌరవించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి మేధావులు, విద్యావంతులు, సామాజిక సేవా కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించండి

ఏపీ రాష్ట్ర పాలఏకిరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్ రాజా



ప్రజాశక్తి - బంగారుపాళ్యం: కాలుష్య నివారణ కోసం చెట్లు నాటాలని రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్ రాజా అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో హోంగార్డు కోదండ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లు వలన వాయు కాలుష్య నివారన చర్యలు చేపట్టొచ్చని చెట్లు మానవాళికి ఆయుష్షను పెంచుతుందని వాటిని కాపాడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి సోమశేఖర్, ఎంపీటీసీ ఉషారాణి, మాజీ సర్పంచ్ ఎంబి కష్ణమూర్తి, ఉప సర్పంచ్ కామరాజు వైయస్సార్సీపి యూత్ ప్రెసిడెంట్ జగదీష్, నాయకులు సుబ్రహ్మణ్యం వాసు, సుబ్రహ్మణ్యం, చిన్నబ్బా రవి, దేవా, నవీన్, పాండు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

చిత్తూరు ఎస్పీ రిషాంత్ రెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రజల ఆశను పెట్టుబడిగా చేసుకొని కొంతమంది సైబర్ నేరగాళ్ళు మోసాలకు పాల్పడుతున్నారని, సైబర్ మోసగాళ్లు సోషల్ మీడియా మాధ్యమాలలో నకిలీ ప్రకటనలు చేసి అందులో డబ్బులు ఇన్వెస్ట్ చెయ్యమని చెప్పి మోసాలు చేస్తున్నారని జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్పీ రిశాంత్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైబర్ నేరగాళ్లు ఒక సంస్థ గా ఏర్పడి అనేక రకాలైన ఇన్వెస్టిమెంట్ ప్రకటనలు వివిధ సోషల్ మీడియా మాధ్యమాలలో ఉంచుతున్నారని, అంతేకాకుండా వాటి గురించి మీ ఫోన్స్‌కి మెసేజులు, వాట్సాప్ మెసేజులు, టెలిగ్రామ్ మెసేజులు పంపిస్తారని వాటిని చూసి మీరు ఆశపడ్డారా! సైబర్ నేరగాళు మిమల్ని మోసం చేస్తారని హెచ్చరించారు. వాళు మిమల్ని వాళ్ళ వెబ్సైటులో ఇన్వెస్ట్ చేస్తే మనీ డబల్ వస్తాయని నమ్మించి కొంత మనీ ఇన్వెస్ట్ చేసి ట్రై చెయ్యండి అని చెప్తారని ఇలాంటి వాటిని నమ్మి ఇన్వెస్ట్ చేస్తే ఆ వెబ్సైటు మళ్ళి కనిపించదు వాళ్ళ ఫోన్స్ కలవు అని, ఒక వేళ ఫోన్ కలిసిన ఇంకొంత డబ్బులు ఇన్వెస్ట్ చేస్తేనే మీ డబ్బులు మీకు వస్తుందని మిమ్మల్ని నమ్మించి మోసం చేస్తారని తెలిపారు. ఇలాంటి మోసపూరిత మాటలను నమ్మొద్దు. వర్క్ ఫ్రొం హెూమ్ ఉద్యోగాలు అంటూ మీ ఫోన్స్‌కి వచ్చే మెసేజులను నమ్మకండి, ఆ మెసేజులలో ఉండే లింక్స్ క్లిక్ చెయ్యకండి. మీరు ఇలాంటి సైబర్ నేరానికి గురి అయినట్లు అయితే చింతించకండి వెంటనే హెల్ప్లైన్ నెంబర్ 1930కి కాల్ చేసి మీ యొక్క ఫిర్యాదు నమోదు చేస్కోండని సూచించారు. సైబర్ క్రైమ్‌ని డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ సైబర్‌క్రైం.జిఏవి. ఇన్ వెబ్‌సైట్ నందు లేదా 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కి ఫోన్ చేసి రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు.

ట్రేడ్స్‌ను అనుకూలంగా ఉండనివ్వాలి

ఆశిష్ కుమార్ చౌహాన్

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ట్రేడ్స్‌ను అనుకూలంగా ఉండనివ్వాలని, అప్పుడే పెట్టుబడులు చక్కని ఫలితాలు ఇస్తాయని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సీఈఓ ఆసీస్ కుమార్ చౌహాన్ తెలిపారు. దీపావళి సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ముహూరత్ ట్రేడింగ్ మా భాగస్వామ్య ఆర్థిక ఆకాంక్షలకు నిదర్శనమన్నారు. ఈ శక్తివంతమైన మార్కెట్ ప్లేస్‌లో, దీపావళి వెలుగులు విరజిమ్ము తున్నప్పుడు, మనం జాగ్రత్తగా ఎంపికలు చేసుకోవటంతో పాటుగా వ్యూహాత్మక పెట్టుబడులతో కూడిన ప్రయాణాన్ని ప్రారంభించదని అన్నారు. ఈ శుభ సమయంలో జరిగే ప్రతి ట్రేడ్ వద్ధిని, పెట్టుబడిదారుల మధ్య ఐక్యత స్ఫూర్తికి నిదర్శనం అన్నారు. పెట్టుబడిదారులను నమోదిత మధ్యవర్తులతో మాత్రమే తమ ట్రేడ్ సంబందిత వ్యవహారాలు చర్చించేలా ఎన్ఎస్ఇ ప్రోత్సహిస్తుందని, క్రమబద్ధీకరించబడని ఉత్పత్తులతో ఎలాంటి సంబంధం పెట్టుకోవద్దు అని, స్టాక్ మార్కెట్ దీర్ఘకాలిక సంపద సష్టి కోసం ఉద్దేశించబడిందని తెలిపారు. ఒక ఇబ్బందికరమైన అనుభవం ప్రభావితమైన పెట్టుబడిదారులను మళ్లీ స్టాక్ మార్కెట్‌లోకి ప్రవేశించడానికి నిరుత్సాహపరుస్తుందని, డెరివేటివ్స్‌లో రిస్క్ ఎక్కువగా ఉన్నందున రిటైల్ ఇన్వెస్టర్లు డెరివేటివ్‌లలో ట్రేడ్‌ను నివారించాలన్నారు. దీర్ఘకాలిక పెట్టుబడిదారులుగా ఉండండి దేశవద్ధి కథనంలో పాల్గొనడానికి ఇది ఉత్తమ మార్గమన్నారు. సమద్ధి, ఆర్థిక విజయం వైపు మనల్ని దీపావళి స్ఫూర్తి నడిపిస్తుంది. ఇక్కడ ప్రతి లావాదేవీ బలమైన, సంపన్నమైన రేపటిని నిర్మించాలనే సామూహిక సంకల్పాన్ని సూచిస్తుందన్నారు.

టిటిడి క్షౌర వృత్తిదారులను తీసేయడం దారుణం

టిడిపి నాయి బ్రాహ్మణ విభాగం రాష్ట్ర కన్వీనర్ శాంతారామ్

ప్రజాశక్తి- కుప్పం

తిరుమల తిరుపతి దేవస్థానం నందు క్షౌర వృత్తిదారులను కేఓడి పేరుతో విధుల నుండి తీసివేయడం దారుణమని తెలుగుదేశం పార్టీ నాయి బ్రాహ్మణ విభాగం రాష్ట్ర కన్వీనియర్ శాంతారామ్ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. వాటి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు పాదయాత్రలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం నందు కళ్యాణకట్టలో విధులు నిర్వహిస్తున్న 859 మంది నాయి బ్రాహ్మణులను శాశ్వత ఉద్యోగులుగా చేస్తామని హామీ ఇచ్చి, నాయి బ్రాహ్మణులను మోసగించారని అన్నారు. ముఖ్యంగా వైసిపి అధికారం చేపట్టిన తరువాత టిటిడి కళ్యాణ కట్ట నందు 49 మందిని విధుల నుండి బహిష్కరించడం దారుణం అన్నారు. ఎన్నికలకు ముందు ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా పరిగణిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి నేడు ప్రైవేటు ఏజెన్సీ కింద విధులు నిర్వహించాలని అనడం దారుణమన్నారు. అలాగే ఇప్పటివరకు ఏడు మందిని విధుల నుండి శాశ్వతంగా తొలగించడమే కాకుండా 49 మంది పై కే ఓ డి విధానాన్ని పెట్టడం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విధుల నుండి తొలగించిన ప్రతి ఒక్కరిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలా జరగని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా నాయి బ్రాహ్మణ కులస్తులు ఏకమై టిటిడి కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు.

హనుమంత వాహనంపై శ్రీపద్మావతి అమ్మవారు



ప్రజాశక్తి- తిరుచానూరు: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన సోమవారం రాత్రి హనుమంత వాహనంపై శ్రీ భద్రాద్రి రాముడి అలంకారంలో శ్రీపద్మావతి అమ్మవారు కటాక్షించారు. అశ్వాలు, వృషభాలు, గజాలు ముందు కదులుతుండగా మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాల నడుమ అమ్మవారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7 గంటల నుండి వాహనసేవ సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించి అమ్మవారిని సేవించుకున్నారు. కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఛైర్మన్ శ్రీ భూమన కరుణాకరరెడ్డి, చంద్రగిరి ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, జేఈవో వీరబ్రహ్మం దంపతులు, ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజన్, విజివో బాలిరెడ్డి, ఏఈవో రమేష్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

పంచమి తీర్థానికి విస్తృత ఏర్పాట్లు : టీటీడీ జేఈవో

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల చివరి రోజైన నవంబరు 18న పంచమితీర్థానికి విశేషంగా భక్తులు విచ్చేసే అవకాశం ఉండడంతో విస్తృతంగా ఏర్పాట్లు చేపడుతున్నట్టు టీటీడీ జేఈవో వీరబ్రహ్మం తెలిపారు. తిరుచానూరులో పంచమితీర్థం ఏర్పాట్లను జేఈవో సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పుష్కరిణిలో గేట్లు, పంచమితీర్థ మండపాన్ని, పద్మ సరోవరంను పరిశీలించారు. భక్తులు ఇబ్బందులు పడకుండా పుష్కరిణిలోనికి ప్రవేశించేందుకు, తిరిగి బయటకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పంచమితీర్థానికి వచ్చే భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు పటిష్టంగా క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. భక్తుల కోసం అన్నప్రసాదం కౌంటర్లు, తాత్కాలిక మరుగుదొడ్లు పెద్దసంఖ్యలో ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతకుముందు తిరుచానూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నవజీవన్ కంటి ఆసుపత్రి, పూడి రోడ్డు వద్ద భక్తులు వేచి ఉండేందుకు ఏర్పాటు చేస్తున్న జర్మన్ షెడ్లను జేఈవో అధికారులతో కలిసి పరిశీలించి, పలు సూచనలు చేశారు. జేఈవో వెంట సిఈ నాగేశ్వరరావు, ఎస్ఈ - 3 సత్యనారాయణ, ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజన్, వీజివో బాలిరెడ్డి, అదనపు ఆరోగ్య అధికారి డాక్టర్ సునీల్, తిరుచానూరు సిఐ శివప్రసాద్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి నియోజకవర్గ స్థాయి సమావేశాలు

- **పాయింట్ ఆఫ్ కాంటాక్ట్స్ విడుదల చేసిన జనసేన పార్టీ**
- **సమన్వయ సమావేశాల్లో రాష్ట్ర, జిల్లా, మండల కమిటీల ప్రధాన పాత్ర**
- **జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్**

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం)

జనసేన, టిడిపి సమన్వయ సమావేశాలు నేటి నుంచి మూడు రోజుల పాటు జరగనున్నాయని ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ సోమవారం ఓ పత్రికా ప్రకటనలో తెలిపారు. పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ కింద ఒక్కో నియోజకవర్గానికి ఒక్కొక్కరిని పార్టీ అధిష్టానం నియమించిందన్నారు. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ నేతలను సమన్వయం చేసేందుకు మాత్రమే వీరిని నియమించామన్నారు. ఈ సమావేశాల్లో ఎక్కడా ప్రొటోకాల్‌కు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీలతో పాటు మండల కమిటీల్లోని కార్యవర్గాలకు ఈ సమావేశాల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రొటోకాల్‌ను విస్మరించవద్దని సూచించారు. అందరూ కలిసి పనిచేయాలని కోరారు. పాయింట్ ఆఫ్ కాంటాక్ట్... పార్టీ సమన్వయ పరిచేందుకు మాత్రమే నియమించామని ఆయన ఆ పత్రికా ప్రకటనలో స్పష్టం చేశారు.

శ్రీసిటీలో మాజీ సర్పంచ్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు

ప్రజాశక్తి -సత్యవేడు: తిరుపతి జిల్లా సత్యవేడు మండలం చెంగంబాక్కం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మునికృష్ణయ్యపై శ్రీసిటీ పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ ఎస్టీ కేసు నమోదు అయ్యింది. చెంగంబాక్కంలో నడుస్తున్న కృష్ణా లావెంజర్ హోటల్లో పనిచేస్తున్న చెంగమ్మ, ధనమ్మ, చెంగమ్మ తదితరులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసును నమోదు చేశామని శ్రీసిటీ ఎస్‌ఐ హరిప్రసాద్ పేర్కొన్నారు. కృష్ణా లావెంజర్ హోటల్లో చెంగమ్మ, ధనమ్మ, చెంగమ్మ కార్మికులుగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో హోటల్ కార్మికుల నిర్వహణ బాధ్యతలను చూస్తున్న మునికృష్ణయ్య మూడు రోజుల క్రితం ధనమ్మ, చెంగమ్మలపై విరుచుకుపడ్డారు. 'హోటల్లోనే ఆహార పదార్థాలను వృథా చేస్తున్నారని, వేతనాలు కూడా ఇచ్చేది లేదు..' అంటూ కులం పేరుతో దూషించారు. ఈ నేపథ్యంలో తీవ్ర ఆవేదనకు గురైన చెంగమ్మ, ధనమ్మ, మరో చెంగమ్మ మాజీ సర్పంచ్ మునికృష్ణయ్య దుర్భాషలాడడంపై శ్రీసిటీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో శ్రీసిటీ పోలీస్ అధికారులు మాజీ సర్పంచి మునికృష్ణయ్యపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఈ కేసును శ్రీసిటీ డీఎస్పీ జగదీష్ నాయక్ విచారణ జరుపనున్నట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.

పుత్తూరులో ట్రాఫిక్ కష్టాలు..!

ట్రాఫిక్ నియంత్రణ లేని కారణంగా కష్టాలు ఎదుర్కొంటున్న వాహన చోదకులు

- నియంత్రణలో అధికారులు విఫలం
- ప్రజలకు తప్పని కష్టాలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరు పట్టణంలో ట్రాఫిక్ నియంత్రించడంలో సంబంధిత అధికారులు విఫలమయ్యారని ప్రజలు వాపోతున్నారు. ట్రాఫిక్ కష్టాలు పరిష్కారం అయ్యేది ఎన్నడు?' అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. సంబంధిత అధికారులు మాత్రం చూసీ చూడనట్లు, వ్యవహరిస్తున్నారు. దీంతో ఇటు ప్రజలు, అటు వాహన దారులకు తీవ్ర ఇబ్బందికరంగా మారుతోంది. ఎన్జీవో కాలనీ డివైడర్ వద్ద సూచిక బోర్డు లేని కారణంగా, రెండు రోజులు ముందు రెప్పపాటు కాలంలో ప్రమాదం తప్పింది. ఆంజనేయులు గుడి స్వామి వద్ద డివైడర్ వద్ద సూచిక బోర్డు లేని కారణంగా రాత్రి వేళలో రోడ్డుపై ఆవులు రావడంతో, వీధిలైట్లు వెలగని కారణంగా, ద్విచక్ర వాహన దారుడు ఆవుకి ఢీకొట్టడంతో బోర్లాపడ్డాడు. సంబంధిత అధికారులు ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించి కఠిన చర్యలు తీసుకోవాల్సి వుంది. పరిమితికి మించి ఆటోలో జనాభా ఎక్కించడం, విచ్చలవిడిగా ఆటోలు నడపడం, అరికట్టాలని ప్రజలు వాపోతున్నారు.

క్రైం న్యూస్

యువకుడు ఆత్మహత్య

ఆత్మహత్యకు పాల్పడ్డ అభిషేక్ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి -సత్యవేడు: క్రిమి సంహారక మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం మండ లంలో చోటుచేసుకుంది. తిరుపతి జిల్లా సత్యవేడు మండలం కన్నవరం ఎస్సీ కాలనీకి చెందిన అభిషేక్(20) క్రిమి సంహారకమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. సత్యవేడు పట్టణం సదవాలమ్మ దేవాలయం సమీపంలో తెలుగు గంగ కాల్వ ప్రాంతంలో అభిషేక్ మృతదేహం ఆదివారం సాయంత్రం బయటపడినట్లు సమాచారం. నాగలాపురం మండలం బీర కుప్పం గ్రామంలో ఓ వివాహిత మహిళతో పరిచయం, వివాదాల నేపథ్యంలో మనస్థాపానికి గురైన కన్నవరం ఈశ్వరన్ కుమారుడు అభిషేక్ ఐదారు రోజులు క్రితమే ఆత్మహత్య చేసుకున్నట్లు మృతదేహం ఆనవాళ్లు బట్టి తెలుస్తోందని స్థానిక ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. అభిషేక్ మృతిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. పోలీసుల విచారణ అనంతరం సమాచారం పూర్తిస్థాయిలో తెలియాల్సి ఉంది. మృతుడు అభిషేక్ హీరో మోటారు కంపెనీలో పనిచేస్తున్నట్టు తెలుస్తోంది.

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ఆదిమూలం

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన కొనసాగాలని స్వామి వారిని కోరుకున్నట్లు తెలిపారు. ప్రజలు సుఖసంతోషాలతో ప్రశాంత జీవితం గడపాలని కోరుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలకు ఎమ్మెల్యే దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దాతలు

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: దీపావళి పండుగను పురస్కరించుకుని భాకరాపేట పారిశుద్ధ్య మహిళా కార్మికులకు వైసిపి కన్వీనర్ తుమ్మిశెట్టి గురుశంకర్, ఆయన కుమారుడు వెంకట తేజ, కోడలు జ్ఞాన కీర్తి దుస్తులు, టపాసులు, మిఠాయిలు పంపిణీ చేశారు. దీపావళి పండుగను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా ఉత్సాహంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. మహిళా కార్మికులు వారి కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.

టిడిపి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ'

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: బివిఎన్ కండ్రిగ మండలంలోని బుచ్చినాయుడు కండ్రిగలో టిడిపి నాయకుల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ..భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మొదటి యూనిట్ ఇన్‌ఛార్జ్ దామా మునెయ్య ఈ కార్యక్రమానికి విచ్చేశారు. 419 ఇళ్లలో సర్వేచేసి ప్రతి ఇంటికి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం నిర్వహించినందుకు నారా లోకేష్ టీడీపీ నాయకులకు ఫోన్ ద్వారా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సోషల్ మీడియా కన్వీనర్ తండా రమేష్, టిడిపి సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: వైసిపి ప్రభుత్వానికి చరమగీతం పాడాల్సిన సమయం దగ్గర ఉందని ఇందు కోసం ఇప్పటి నుంచి ప్రజలు సమాయత్తం కావాలని జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కన్నయ్య నాయుడు తెలిపారు. మండలంలోని వెన్నలత్తూరు, కారణిమిట్ట గ్రామంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం ఎంతో పాటుపడ్డారని అటువంటి నాయకుడినైనా జగన్‌మోహన్‌రెడ్డి తప్పుడు కేసులు బనాయించి జైల్లో పెట్టారని తెలిపారు. చంద్రబాబుపై ఎన్ని కేసులు పెట్టినా చివరకు న్యాయమే గెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజేపీ కో ఆర్డినేటర్ రమేష్ నాయకులు దస్సయ్య, మునెయ్య, గుణశేఖర్ పాల్గొన్నారు.

ఇంటింటికీ కరపత్రాలు పంచుతున్న టిడిపి నాయకులు

కార్మికుల సంక్షేమానికి కృషి

వైసిపి నాయకులు శివశంకర రాజు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కార్మికుల సంక్షేమానికి వైసిపి కట్టుబడి పనిచేస్తుందని మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామ పంచాయతీ వైసిపి అధ్యక్షులు గుండ్రాజు శివ శంకరరాజు అన్నారు. దీపావళిని పురస్కరించుకుని పంచాయతీలో పని చేస్తున్న పారిశుద్ధ కార్మికులకు, వంటు ఆపరేటర్లు, సిబ్బందికి బెంకాయ నూనె, సోపులు, బెడ్‌షీట్లు, టపాకాయలను వితరణ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వకుళ మాట్లాడుతూ పంచాయతీలోని హెల్త్ వర్కర్స్ ఎంతో శుభ్రంగా ఉంచే పారిశుద్ధ్య కార్మికులకు వ్యక్తిగత శుభ్రత కోసం ఈ వస్తువులు ప్రభుత్వం ఇస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గుండ్రాజు లక్ష్మీదేవి, ఉప సర్పంచి తిరుమల ప్రసాద్ బాబు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, వైసిపి పంచాయతీ అధ్యక్షులు రమేష్, వార్డు మెంబర్లు రాము, రమేష్, నాగేంద్ర, మోహన్, వైసిపి నాయకులు ఏవిఎం శ్రీనివాసులు, రమణ, శ్రావణి, సరస్వతి, రమణ, దయాకర్ పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తులు, టపాకాయలు పంపిణీ చేస్తున్న వైసిపి పంచాయతీ నాయకులు గుండ్రాజు శివశంకరరాజు

పంచాయతీ కార్మికుల జీతాలు చెల్లిస్తాం: సర్పంచ్

ప్రజాశక్తి - రేణిగుంట : రేణిగుంట గ్రామ పంచాయతీ కార్మికుల జీతాలను రెండు రోజుల్లో చెల్లిస్తామని గ్రామ పంచాయతీ సర్పంచ్ నగేషం స్పష్టం చేశారు. పంచాయతీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ నగేషం మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు అక్టోబర్ నెల జీతం బాకీ రెండు రోజుల్లో వారి ఖాతాల్లో జమవుతుందని తెలిపారు. కార్మికులకు అక్టోబర్ నెల జీతం ఆలస్యం కావడంతో నిరసన తెలుపడం బాధగా ఉందన్నారు. పంచాయతీ పాలనలో కార్మికులు పాత్ర కీలకమన్నారు. కార్మికులు ఇబ్బందుల పడకూడదని ప్రతి నెల 5వ తేదీ జీతం వచ్చేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రస్తుతం బ్యాంకు వరస సెలవుల వల్ల ఈ నెల జీతం ఆలస్యం అయిందని తెలిపారు. పంచాయతీ నుంచి నగదు బ్యాంకుల్లో జమ చేశామని మంగళవారం లోపు కార్మికులు జీతాలు వారికి అందుతాయన్నారు. కార్మికులు ప్రజలకు ఇబ్బంది కలగకుండా పారిశుద్ధ్య లోపం లేకుండా విధులు నిర్వహించాలని కోరారు. కొందరు వ్యక్తిగత స్వలాభం వల్ల పంచాయతీలో సమస్యలు సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరు ఎన్ని సమస్యలు సృష్టించినా ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల ఇన్‌చార్జి ప్రతిమ్మ సూచనలతో ముందుకెళుతున్నామన్నారు. రేణిగుంట గ్రామ పంచాయతీ ప్రజలకు పంచాయతీ కార్మికులకు సిబ్బందికి సచివాలయ సిబ్బందికి, వార్డు వాలంటీర్లకు సర్పంచ్ నగేషం దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

క్యాన్సర్ బాధితురాలికి చేయూత

ప్రజాశక్తి - గూడూరు రూరల్: ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం గూడూరు రూ మండల పరిధిలోని విందూర్ గ్రామం లోని గిరిజన కాలనీ లో పావని అను మహిళకు క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతోంది. పావనికి మానవతా సాయంగా రిలైన్స్ విద్యుత్ ఉద్యోగుల వర్ల్ 5వేలు, సంస్థ తరఫున 5 వేల రూపాయలను అందించారు. అనంతరం ఫల సరుకులను అందించారు. కుటుంబ సభ్యులకు దుస్తులు అందించారు. ఈ సందర్భంగా సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. దాతల సేవలు మరువలేనివి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సేవా సంస్థ ఉపాధ్యక్షులు బండి ధనంజయ రెడ్డి, అబ్దుల్లా, అరుణ్ కుమార్, అంగన్‌వాడీ టీచర్ వాణి, కార్యదర్శి జగన్మోహన్ రావు, ప్రజెంద్రరెడ్డి, బిబిఐ ప్రభాకర్, పిడికిఐ ముల్లా, శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, గ్రైట్ ప్రభాకర్, వాక్ షాప్ రాము, శివకుమార్ రెడ్డి(శివాని స్టడీ సర్కిల్), రాధయ్య, కుమార్ రు పాల్గొన్నారు.

ప్రజా రక్షణ భేరి సభను విజయవంతం చేద్దాం: సీపీఎం

ప్రజారక్షణ భేరి కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - బాలాయపల్లి : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఈనెల 15న విజయవాడ లో నిర్వహించనున్న ప్రజారక్షణ భేరి ప్రదర్శన, బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు జోగి శివకుమార్ పేర్కొన్నారు. ప్రజారక్షణ భేరి విజయవంతంపై మండలంలోని అంబలపూడి, బాలాయపల్లిలలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాల్ని నిరసిస్తూ ఈనెల 15వ తేదీ విజయవాడలో ప్రజారక్షణ భేరి ప్రదర్శన, బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. రాష్ట్ర రాజధాని విషయంలో ప్రభుత్వ వైఖరి వింతగా ఉందన్నారు. రాష్ట్రంలో కక్ష పూరిత రాజకీయాలు పెరిగిపోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్ సురేష్, అడపాల ప్రసాద్, బుడతాటి చంద్రయ్య, జి మధన్, పాణి, జయమ్మ, గజ్జల రాజగోపాల్ పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : విజయవాడలో ఈ నెల15వ తేదీ నిర్వహించనున్న ప్రజా రక్షణ భేరీని విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను వడమాలపేట మండల కేంద్రంలో మార్కెట్ యార్డ్ ఆవరణలో సీఐటీయూ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల సీఐటీయూ అధ్యక్షులు వై నందయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయని నిత్యావసర వస్తువులు రోజు రోజుకి పెరుగుతున్నాయని డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు ప్రజలపై భారం పడు తోందని ప్రభుత్వ రంగ పరిశ్రమలను అంబాని, ఆదానిలకు దోచి పెడుతున్నారని అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగులకు చేసిన వాగ్దానాలు గాలిలో కలిసి పాయిందన్నారు. విశాఖ ఉక్కును ఆదాని అంబానికి తెగ అమ్మేస్తున్నారని ఆయన వాపో యారు. వీటిపై పోరాడేందుకు సీపీఎం ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించనున్న సభలో సిపిఎం నాయకులు ప్రధాన వక్తలు సీతారాం ఏచూరి, బివి రాఘవులు పాల్గొంటారని తెలిపారు. వడమాల పేట మండలం నుంచి అధిక సంఖ్యలో రైతులు, వ్యవసాయ కూలీలు, మహిళలు, యువజన సంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఈ శ్రీనివాసులు, పి రాణి, ఆదిలక్ష్మి, బి చక్రవర్తి, పి చిన్నబ్బ, టి గణేష్ పాల్గొన్నారు.

పుత్తూరులో ప్రజారక్షణ భేరి వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ఈనెల 15న సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న బహిరంగ ప్రజా రక్షణ భేరి సభను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక కార్వేటినగరం రోడ్డులో సిఐటియు నాయకులు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా సిపిఎం, జిల్లా జిల్లా కార్యవర్గ సభ్యులు ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పురుషోత్తం మాట్లాడుతూ బీజేపీ వ్యతిరేక విధానాలు నశించాలని, ఆటో వర్కర్స్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని బిల్డింగ్ వర్కర్లలకు సంక్షేమ బోర్డు నుంచి వారికి నిధులు కేటాయించాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, ప్రతి కుటుంబానికి అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, స్కీం వర్కర్లకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రజా రక్షణభేరి బహిరంగ సభకు ప్రజలు, కార్మిక, కర్షకులు సిపిఎం సానుభూతి పరులు తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రమేష్, నాయుడు, ప్రవీణ్, సుధాకర్, శివ పాల్గొన్నారు.

వడమాలపేటలో ప్రజారక్షణ భేరి కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిపిఎం , సిఐటియు నాయకులు

గూడూరు టౌన్ : ప్రజా సమస్యల పై ఈనెల 15 న జరిగే చలో విజయ వాడలో నిర్వ హిం చనున్న ప్రజా రక్షణ భేరి సభను జయప్రదం చేయా లని సీపీఎం నాయకులు పిలు పు నిచ్చారు. గూడూ రు పురపాలక పరిధిలోని చెన్నూరు ప్రాంతంలోని అరుంధతి వాడ , తదితర ప్రాంతాలలో ఇంటింటికీ తిరిగి ప్రజ రక్షణ భేరీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం సెంట్రల్ శాఖా కార్యదర్శి జోగి శివకుమార్ మాట్లడుతూ ప్రజా సమస్యలపై సీపీఎం పోరాడుతుంటే బీజేపీ టీడీపి వైసిపి జనసేన అధికారం కోసం అరాట పడుతున్నారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15 న విజయవాడలో జరిగే ప్రజా రక్షణ భేరీ యాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి సురేష్ , మణి , బి.చంద్రయ్య కె.వి.పి. ఎస్ నాయకులు అడపాల ప్రసాద్ , చెన్నూరు నాయకులు అర్. శ్రీనివాసులు , గుర్రం రమణయ్య పాల్గొన్నారు.

గూడూరులో ప్రజా రక్షణ భేరి కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి - బాలాయపల్లి : అగ్ని ప్రమాదం కారణంగా పూరిల్లు దగ్ధమైన సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. బాలాయపల్లి మండలం సుబ్రహ్మణ్యం గ్రామానికి చెందిన బాధితుడు మేకల వెంకటయ్య కథనం మేరకు.. బర్రెలు కొనుగోలు కోసం ఓ రైతు వద్ద వడ్డీకి తెచ్చుకున్న రూ 60 వేలు ఈ ప్రమాదంలో కాలిపోయాయని తెలిపాడు. దీపావళి సందర్భంగా దేవునికి దీపం వెలిగించారు. రాత్రి ఇంట్లో నిద్రపోవడంతో ఆ దీపం పక్కనే ఉన్న మట్టలకు అంటుకుని మంటలు వ్యాపించాయి. క్షణాల్లోనే మంటలు ఇంటిని చుట్టుముట్టడంతో పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో బీరువాలో ఉన్న డబ్బులు, దుస్తులు కొద్దిగా కాలిపోయాయని తెలిపారు. ఈ విషయం రెవెన్యూ సిబ్బందికి సమాచారం తెలిపి రెండు రోజుల గడుస్తున్నా ఎటువంటి సాయం అందించలేదని బాధితుడు వాపోయాడు.



చెట్టు విరిగి కూలిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరు పట్టణంలో ఎన్జీవో కాలనీ ఫారెస్ట్ ఆఫీసులోని టెంకాయ చెట్టు ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో హఠాత్తుగా కూలి విద్యుత్ స్తంభంపై పడి విరిగిపోయింది. అదే సమయానికి విద్యుత్ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో పెనుముప్పు తప్పింది. కాలనీ వాసులు ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదని ప్రజలు వాపోయారు. ఫారెస్ట్ ఆఫీసర్ వారు కార్యాలయంలో వున్నా చెట్లను పర్యవేక్షించకపోవడమే దీనికి కారణమని ప్రజలు చెబుతున్నారు. ఇకనైనా అధికారులు వారి ఆఫీసు చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలను పరివేక్షించాలని వారు కోరారు.

తప్పిన పెను ప్రమాదం

జర్నలిస్టులందరూ మా కుటుంబ సభ్యులే: తుడా ఛైర్మన్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: జర్నలిస్టులందరూ మా కుటుంబ సభ్యులు గానే భావిస్తామని తుడా ఛైర్మన్, చంద్రగిరి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. తిరుపతి చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని జర్నలిస్టులందరికీ ఆదివారం దీపావళి కానుకలను చెవిరెడ్డి మోహిత్ రెడ్డి స్వయంగా అందజేశారు. టపాసులు గిఫ్ట్ బాక్స్ తో పాటు వాల్ క్లాక్ ను ఆయన అందించారు. ఈ సందర్భంగా తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి, దీపావళి పండుగలను తాము జర్నలిస్టులతో కలిసి ప్రతి ఏటా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. తమ తండ్రి, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి జర్నలిస్టులతో ఎంతో అవినాభావ సంబంధం కలిగి ఉండటాన్ని తాను స్వయంగా చూశానన్నారు. ఈ సత్సంబంధాలను నిరంతరం కొనసాగిస్తామని మోహిత్ రెడ్డి చెప్పారు. ఈ సంక్రాంతికి జగనన్న జర్నలిస్టులందరికీ సొంత ఇంటి స్థలం కలను సాకారం చేయనున్నారని చెప్పారు. జర్నలిస్టుల కుటుంబాల్లో జగనన్న ముందే సంక్రాంతిని తీసుకువచ్చారని సంతోషం వ్యక్తం చేశారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దీపావళి సంబరాలు

ప్రజాశక్తి - రామచంద్రాపురం: తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం అనుప్పల్లి పంచాయతీ రేకలచేను, గోకులాపురం, ఉప్పులి వంక, గడ్డ కింద పల్లి గ్రామాల్లో తిరుపతి రోటరీ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఆదివారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొదట రోటరీ క్లబ్ సభ్యులందరూ శివుని దర్శించుకుని, గ్రామస్తులతో కలిసి సంప్రదాయ గ్రామీణ క్రీడలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. తదుపరి గ్రామీణ మహిళల స్వయం సమృద్ధి, రైతుల ఆర్థిక అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రణాళికా బద్ధంగా ముందడుగు వేయాలని తీర్మానించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ సెక్రటరీ సోము రవికుమార్ మాట్లాడుతూ దీపావళి సంబరాలు దత్తత గ్రామాల ప్రజల మధ్య జరుపుకోవడం తమకంతో ఆనందంగా ఉందని, ఈ నాలుగు గ్రామాల్లోని మహిళల సర్వతో ముఖాభివృద్ధి కోసం ఇప్పటికే టైలరింగ్, బ్యూటీషియన్ మొదలగు కోర్సులలో ట్రైనింగ్ ఇప్పించామని, భవిష్యత్తులో ఫొటో ఫ్రేమ్ తయారీ, మార్కెటింగ్ కోర్సులో శిక్షణ ఇస్తామని, రైతుల అభివృద్ధి కోసం అధునాతన పద్ధతిలో వ్యవసాయ శాస్త్రవేత్తల సహాయంతో రైతులకు శిక్షణ ఇప్పిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శివాలయం ట్రస్ట్ ఛైర్మన్ కొర్లకుంట గురునాథరెడ్డి, ట్రస్ట్ సభ్యులు, ప్రముఖ న్యాయవాది మట్టా పురుషోత్తం రెడ్డి, తిరుపతి సంకల్ప హాస్పిటల్ బండ్ల సోమేశ్వర్, రోటరీ క్లబ్ సభ్యులు మాగం హేమచంద్ర, దామోదర గుప్త, కరుణానిధి, రాజేష్ కుమార్, సుదర్శన రాజు, తోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దీపావళి సంబరాల్లో పాల్గొన్న మహిళలు

చేయూత ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు అందిస్తున్న దాతలు

చేయూత ఆధ్వర్యంలో దుప్పట్లు వితరణ

ప్రజాశక్తి -రేణిగుంట : రేణిగుంటలోని చేయూత సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో రేణిగుంట మండలం కొత్తపాలెం ఎస్టీ కాలనీ లోని వారికి దీపావళి సందర్భంగా ఆదివారం ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షురాలు ప్రత్యూష మాట్లాడుతూ అందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. గిరిజన ప్రాంతంలోని ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా చేయూత సోషల్ సర్వీస్ సొసైటీ సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. పేదరిక నిర్మూలన విద్యతోనే సాధ్యమని పేర్కొన్నారు. గిరిజన ప్రాంత మహిళలు తమ పిల్లలను పాఠశాలలకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు జూలియన్ రాజు, ఆషా ముఖ్య సలహాదారులు అమ్ములు రాజు, వెంకటరమణయ్య, రమణమ్మ పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని రెడ్ సంస్థ ఆధ్వర్యంలో దీపావళి పండుగను పురస్కరించుకొని 40 మంది పేదలు, దివ్యాంగులకు టపాసులు కొత్త దుస్తులు స్వీట్లు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ న్యాయవాది గూడూరు వసంత్ కుమార్, న్యాయవాది తీగల చంద్రశేఖర్, జిల్లా చంద్రశేఖర్ పాల్గొన్నారు. అనంతరం దివ్యాంగులకి దీపావళి కానుక అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ దివ్యాంగులకు సేవ చేస్తున్న రెడ్ సంస్థ సేవలు అభినందనీయం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ సంస్థ సభ్యులు , వసంత్ కుమార్, శ్రీధర్, చంద్ర పాల్గొన్నారు.

వేదిక్ వర్సిటీలో రుద్రాభిషేకం

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలోని ధ్యానారామంలో వెలసిన బృహదీశ్వర స్వామికి(మహా శివలింగం) కార్తీక మాసాన్ని పురస్కరించుకొని నెలరోజులపాటు లోక క్షేమం కోసం ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు లఘు న్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం వేద విశ్వవిద్యాలయ వేద ,శాస్త్ర, శైవాగమ పండితులు నిర్వహిస్తున్నట్లు పిఆర్ఒ డాక్టరు టి బ్రహ్మాచార్యులు తెలిపారు. ఈ అభిషేకం ప్రతిరోజూ శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్‌లో ప్రత్యక్ష ప్రసారం అవుతుందని తిరుపతి వాసులు ఈ అభిషేకాన్ని ప్రత్యక్షంగా తిలకించవచ్చని తెలిపారు.

నాగాభరణం, త్రిశూలం బహూకరణ

ధ్యానారామంలోని బృహదీశ్వర ఆలయానికి తిరుపతికి చెందిన ఆర్ శ్యాంసుందర్ రెడ్డి, డాక్టర్ ముని శంకర్ రెడ్డి, వేద విశ్వవిద్యాలయ ఫైనాన్స్ ఆఫీసర్ పి అంజి రెడ్డిలు 4 లక్షల రూపాయల విలువచేసే పంచలోహాలతో చేసిన నాగాభరణం, త్రిశూలాన్ని వేదవిశ్వ విద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య రాణి సదాశివమూర్తికి అదించారు. తిరుపతికి చెందిన కమల శ్రీనివాసన్ 20 వేల రూపాయలు విలువ చేసే పరదాల్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఏవి రాధేశ్యామ్, పిఆర్ఒ డాక్టరు టి బ్రహ్మాచార్యులు, ఆర్ సత్యనారాయణాచార్యులు, పి నీలకంఠం పాల్గొన్నారు.

వైభవంగా కేదారేశ్వర వ్రతం

ప్రజాశక్తి -రామచంద్రాపురం: దీపావళి పురస్కరించుకుని మండలంలో కేదారేశ్వర స్వామి వ్రతం వైభవంగా నిర్వహించారు. సోమవారం మండలంలోని రాయల చెరువు పేట, ఎన్ఆర్ కమ్మపల్లి, కుప్పం బాదూరు, గంగిరెడ్డిపల్లి, కమ్మపల్లి, నెత్త కుప్పం, అనుపల్లి గ్రామాలలో మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ఉపవాసాలతో పూజలు నిర్వహించారు. పసుపు ముద్దలతో అమ్మవారి ప్రతిమలను తయారు చేసి బంగారు ఆభరణాలు, పట్టు వస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించి, వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి వ్రతంలో నోము దారాలు, బొందారాలు, పసుపు కుంకుమ, గాజులు మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డి బిందు మాధవి, వి సుజాత, వి విజయ, కల్పన, కవిత, సిరిపిరెడ్డి చైతన్య, గ్రామాలలోని మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

వీధుల్లో గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి-బుచ్చి నాయుడు కండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగ మండల కేంద్రంలోని అరుధంతీయ వాడలోని ప్రధాన వీధి గుంతలకు ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్మల రాఘవయ్య మాదిగ మట్టిని తోలి చదను చేశారు. ప్రధాన వీధిలో తట్టుగా ఉండటంతో వర్షపు నీరు నిలిచిపోయి ప్రజలకు నడవడానికి ఇబ్బందిగా మారడంతో రాఘవయ్య సొంత నిధులు వెచ్చించి ట్రాక్టర్లతో మట్టిని తోలించి ఎక్సకవేటర్‌తో చదను చేయించారు.

సర్పంచుల సంఘం అధ్యక్షులు శివయ్యకు సన్మానం

ప్రజాశక్తి-ఏర్పేడు: ఏర్పేడు లో ఆయుధ పూజ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏర్పేడు గ్రామపంచాయతీలోని సుమతి ట్రేడర్స్ వద్ద జరిగిన ఆయుధ పూజ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి గున్నేరు కిషోర్ రెడ్డి సర్పంచుల సంఘం అధ్యక్షుడు నల్లపాలెం శివయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్మికులకు స్వీట్లు, దుస్తులు పంపిణీ చేశారు. సుమతి ట్రేడర్స్ యజమాని మధు మండల ఇన్‌చార్జి గున్నేరు కిషోర్ రెడ్డిని సర్పంచుల సంఘం అధ్యక్షుడు నల్ల పాలెం శివయ్యను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి- బుచ్చినాదుకండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989 - 90 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు పాఠశాలలో కలుసు కున్నారు. పాఠశాల జ్ఞాపకాలను, గుర్తులను నెమర వేసుకున్నారు. ఉపాధ్యాయులను గురించి చర్చించుకుని పాఠశాల అభివృద్ధిలో అందరం భాగస్వాములు కావాలని తీర్మానించుకుని మరోసారి అందరూ విద్యార్థులు కలుసుకోవాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, లోకనాథం, మునిరాజా పాల్గొన్నారు.

In The Court of the Senior Civil Judge : Gudur

H.M.O.P.No. 171 / 2023

Siddapareddy Ravindra Reddy - Petitioner

Vs

Siddapareddy Prathibha - Respondent

Notice to Respondent

Siddapareddy Prathibha,
W/o **Siddapareddy Ravindra Reddy,**
Residing at Near Regal Rolling Shutters,
Chillakur Village, Chillakur Mandal,
Tirupati District.

పై నెంబరు కేసులో పిటిషనరు మీమీద పై వారికోర్టులో విడాకులు కోరుచూ **H.M.O.P. 171/2023** పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే7-12-2023దిన** వాయిదా ఉన్నది. ఆరోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పైతెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

బోమిడి సంజీవయ్య, బి.ఎ., బి.ఎల్.,
పిటిషనరు తరపు న్యాయవాది, గూడూరు.

7వ అదనపు జిల్లా జడ్జి వారికోర్టు : గూడూరు

E.P.No. 252/2021

O.S.No. 13/2017

షేక్. అక్బర్ ఆలి తరపు GPA
షేక్. అబ్దుల్ ఖాదర్ బాషా – డిక్రీ హోల్డరు / వాది

Vs

షేక్.రఫి, తండ్రి షేక్.గులాం హుస్సేన్,
నివాసము డోర్ నెం.3/106-7,
భనిగిసాహెబ్ పేట, గూడూరు, తిరుపతి జిల్లా.
– బాకీదారు / ప్రతివాది

దావా నోటీసు

పైన చెప్పిన వాది ప్రతివాదిపైన తనకు రావలసిన కోర్టు డిక్రీ ప్రకారం నిర్ణయమైన మొత్తమును రాబట్టుకొనుటకు దాఖలు చేసిన పై నంబరు ఇ.పి. ప్రతివాది నోటీసు నిమిత్తము **తే30-01-2024 దిన** వాయిదా వేసివున్నందున ప్రతివాది సదరు తేదీన ఉదయము 10.30 గం॥లకు కోర్టుకు హాజరై సంజాయిషీ చెప్పుకొనని యెడల వారి పరోక్షములో కేసు తీర్మానించబడును.

నెల్లూరు

తేది: 13-11-2023

ఆర్. సత్యనారాయణ
డిక్రీ హోల్డరు తరపున న్యాయవాది